జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | 4 | సెప్టెంబర్ | 2026 • పేజీలు : 7

# మహిళలు,చిన్నారుల భద్రతకు పటిష్ట చర్యలు

- జిల్లా మహిళా భద్రతా విభాగం ఏర్పాటు...
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్...



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతి నిధి. సెప్టెంబర్ 03,(ప్రజాజ్యోతి)** తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిల్లా మహిళా భద్రతా విభాగాన్ని నూతనంగా ఏర్పాటు చేశామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు.మహిళలు,చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టడం,బాధితులకు తక్షణ సహాయం అందించడం,కేసుల దర్యాప్తు, పర్యవేక్షణ,అవగాహన కార్యక్రమాలు,కౌన్సెలింగ్,పునరావాసం వంటి కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించడం ఈ విభాగం ప్రధాన

మిగతా 2 లో...

# ఏసీబీకి చిక్కిన ఫారెస్ట్ బీట్ అధికారి



- రూ 30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో బిట్ ఆఫీసర్

**గుండాల సెప్టెంబర్ 3 ప్రజాజ్యోతి** ఓ రైతు భూమిలో ఫ్రెంచ్ కొట్టకుండా ఉండేందుకు 30 వేలు లంచం తీసుకుంటూ మధ్య వ్యక్తితో పాటు ఫారెస్ట్ బీట్, అధికారి ఏసీబీ వల్లో చిక్కారు. ఏసీబీ డిఎస్ పి. వై రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి గుండాల మండలం కాంచనపల్లి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోనీ ఆళ్లపల్లి మండలం వలసల బీట్ అధికారిగా పనిచేస్తున్న బీట్ అధికారి బానోత్ రవికుమార్ రామానుజ గూడెం బీట్కు ఇన్చార్జిగా వారిస్తున్నాడు. రామానుజుగూడెం గ్రామానికి చెందిన ఓ రైతు రెండున్నర ఎకరాలలో వ్యవసాయం చేస్తుండగా అందులో రెండు ఎకరాలకు పట్టా ఉండగా అర ఎకరం పోడు సేద్యం చేస్తున్నాడు. కాగా ఆ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు ప్లాంటేషన్ నిమిత్తం ట్రంచ్ తీస్తున్నారు. దీంతో ఇదే అదునుగా భావించిన బీట్ ఆఫీసర్ నాలుగు రోజుల క్రితం ఫ్రెంచ్ తీస్తున్నామని బెదిరించాడు. అర ఎకరంలో ఉన్న పోడు భూమిని ఫ్రెంచ్ కొట్టకుండా ఉండాలంటే 30, వేలు ఇవ్వాలంటూ ఆ రైతును డిమాండ్ చేశారు. బాధిత రైతు అంత ఇవ్వలేనంటూ బీటాధికారిని బ్రతిమిలాడిన ఉపయోగం లేకపోవడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రవికుమార్ ఆదేశానుసారం

మిగతా 2 లో...




# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- ప్రతి భూ యజమానికి చట్టబద్ధత హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- పెండింగ్లో ఉన్న అటవీ _రెవెన్యూ భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించాలి
- రాష్ట్రవ్యాప్తంగా భూ_ రీ సర్వే ను వేగవంతం చేయాలి
- రెవెన్యూ, రీ సర్వే రిజిస్ట్రేషన్ హౌసింగ్ అంశాలపై ఐడిఓసి లో జరిగిన సమీక్షలో
- మంత్రి పొంగులేటి

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 3,(ప్రజాజ్యోతి)** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెవెన్యూ, రీ – సర్వే, రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై భద్రాద్రి ఐడిఓసి కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాప్రజా ప్రతినిధులు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, గృహ నిర్మాణ శాఖల కార్యదర్శులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ (సీ.సీ.ఎల్.ఏ), రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శిగా డి.ఎస్. లోకేశ్ కుమార్, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి (రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు) రాజీవ్‌గాంధీ హనుమంతులతో కలిసి ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని భూ రీ – సర్వే పురోగతి, నాన్–కెడస్ట్రల్ , కెడస్ట్రల్ గ్రామాల్లో సర్వే పనులు, లైసెన్స్‌డ్ సర్వేయర్ల పనితీరు, 22–ఏ భూముల వివరాలు, సాదా బైనామాలు, అటవీ – రెవెన్యూ భూముల సరిహద్దు వివాదాలు, ధరణి స్థానంలో అమలులోకి వచ్చిన భూ భారతి చట్టం, రిజిస్ట్రేషన్ శాఖ నూతన కార్యాలయాల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, రెండో విడత ఇళ్ల మంజూరు, ఉచిత ఇసుక సరఫరా తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ..సామాన్య ప్రజానీకం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

మిగతా 2 లో...

# కన్సల్టెన్సీ ఆఫీస్‌గా మారిన అశ్వరావుపేట ప్రభుత్వ దవాఖానా?




- ప్రసవం అంటే సేవా... లేక వసూళ్ల పర్వమా?
- వైద్యం అడిగితే కేసుల బెదిరింపులా?.. డీఎంహెచ్ఓ/ డీసీహెచ్ఎస్ స్థాయిలో ఖాళీలు లేవనే సమాధానమా?
- కలెక్టర్ సార్... ఇక మీరైనా పట్టించుకోండి!

**అశ్వరావుపేట ప్రజా జ్యోతి సెప్టెంబర్ 3** పేద ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అశ్వరావుపేట ప్రభుత్వ దవాఖానపై వరుస ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి అంటే ఉచిత వైద్యం, అత్యవసర సేవలు, పేదలకు భరోసా ఉండాలి. కానీ ఇక్కడ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. “దవాఖానా వైద్యం కోసం నడుస్తోందా... లేక కన్సల్టెన్సీ ఆఫీస్‌లా మారిందా?” అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గర్భిణీలు, ప్రసవాల కోసం ఆసుపత్రికి వచ్చే కుటుంబాల నుంచి డబ్బుల వసూళ్లపై ఆరోపణలు రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ఆసుపత్రిలో బిడ్డకు జన్మనిస్తే

మిగతా 2 లో...

# శిరీషకు న్యాయం.. లేదంటే పోరాటం : నటుడు తనీష్



కేసును సీబీఐకి అప్పగించి.. ఆస్పత్రి నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి

రెండు రోజుల్లో చర్యలు లేకుంటే ఆస్పత్రి ఎదుట జన సేన ఆందోళన

2 లో...

## మహిళలు, చిన్నారుల భద్రతకు పటిష్ట చర్యలు

(మొదటి పేజీ తరువాయి...)

బాధ్యతలుగా ఉంటాయన్నారు. గురువారం ఎస్పీ రోహిత్ రాజు జిల్లా మహిళా భద్రతా విభాగం సభ్యులతో సమావేశమై వారి విధులు,బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు.మహిళలు, బాలికలు,చిన్నారుల భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి బాధితుల కు అండగా నిలవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే పనిచేస్తున్న మహిళా భద్రతా బృందాలు,మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం,మహిళా పోలీస్ స్టేషన్, కౌన్సెలింగ్ కేంద్రాలతో సమన్వయం చేసుకుంటూ మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎస్బీ ఇన్స్పెక్టర్ ఇ.శ్రీనివాస్,ఎస్సై శ్రీనివాస్, ఏఎస్ఐ కస్తూరి,సిబ్బంది పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన ఫారెస్ట్ బీట్ అధికారి

(మొదటి పేజీ తరువాయి...)

పటాన్ సాదిక్ ఖాన్ అనే మధ్య వ్యక్తి రైతు నుంచి డబ్బులు తీసుకున్నాడు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పటాన్ సాదిక్ ఖాన్ రైతు నుంచి 30, వెయ్యిలు లంచం తీసుకుంటూ ఉండగా రామానుజి గూడెంలో ఏసీబీ అధికారులు పట్టుకున్నారఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో ఏసీబీ డిఎస్పి వై రమేష్ మాట్లాడుతూ ఏజెన్సీలో మీ ప్రజలకు అవినీతి నిరోధక శాఖ పై పూర్తి అవగాహన ఉందని, తద్వారా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఫిర్యాదు వచ్చిన రెండు రోజుల్లోనే సాక్షాలతో బీట్ ఆఫీసర్ రవికుమార్ను అదుపులోకి తీసుకున్నామన్నారు లంచం తీసుకున్న బీట్ ఆఫీసర్ రవికుమార్ తో పాటు మధ్య వ్యక్తి ఖాన్ పై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

## శిరీషకు న్యాయం.. లేదంటే పోరాటం : నటుడు తనీష్





**ములకలపల్లి సెప్టెంబర్ 03, (ప్రజాజ్యోతి):** హైదరాబాద్ తుక్కుగూడలో మృతి చెందిన ఆదివాసీ యువతి ఊకే శిరీష కుటుంబాన్ని జనసేన తెలంగాణ రాష్ట్ర నాయకుడు, సినీ నటుడు తనీష్ గురువారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ శిరీషకు న్యాయం చేయాలని ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. శిరీష పనిచేసిన ప్రైవేట్ ఆస్పత్రిలో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, ఎంట్రీ, ఎగ్జిట్ రిజిస్టర్లు, సిబ్బందికి కనీస వసతులు వంటి అంశాలపై అనుమానాలు ఉన్నాయని తనీష్ తెలిపారు. ఆస్పత్రి నిర్లక్ష్యంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరారు. నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే ఆస్పత్రి యాజమాన్యంపై కేసు నమోదు చేసి, ఆస్పత్రిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కేసు దర్యాప్తు, పోస్టుమార్టం ప్రక్రియపైనా పలు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి తగిన పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివాసీ బిడ్డకు జరిగిన అన్యాయంపై మంత్రి సీతక్క సరైన రీతిలో స్పందించలేదన్నారు. కుటుంబానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి రెండు రోజుల్లోగా తగిన చర్యలు తీసుకోవాలి. లేదంటే జనసేన ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట కూర్చొని పోరాటం చేస్తామని తనీష్ స్పష్టం చేశారు. ఈ పోరాటానికి కలిసి వచ్చే వారు ముందుకు రావచ్చని పిలుపునిచ్చారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన రాష్ట్ర సహాయ కార్యదర్శి ఊకె రవి ,జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి...)

చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టాన్ని రూపొందించి దానిని పకడ్బందీగా అమలు చేస్తుందని తెలిపారు. అందులో భాగంగా రెవిన్యూ సిబ్బంది తాహసిల్దార్,ఆర్డీవోలు సిబ్బంది పనిచేయాలన్నారు. భూములు ఉన్నవారికి న్యాయం చేసేలా ఈ భూ భారతి చట్టం రూపొందిందని, ఏటువంటి దరఖాస్తులు వచ్చిన సర్వే చేసి సంబంధిత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధుల పూర్తి సహాయ సహకారాలు సమన్వయంతో ఈ సర్వేను పూర్తి చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అలసత్వం చేసిన ఎలాంటి అధికారినైనా ఉపేక్షించేది లేదని శాఖ పరమైన చర్యలు తక్షణమే తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ రివ్యూ సమావేశం కేవలం కాగితాల కోసం పెట్టలేదని.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పెండింగ్లో ఉన్న భూ సమస్యలను వెలికి తీసి అధికారుల సమక్షంలో పరిష్కరించేందుకు ఏర్పాటు చేశామని తెలియజేశారు. గత కొన్ని నెలలుగా కార్యాలయాల్లో ఎన్ని అప్లికేషన్ పెండింగ్ ఉన్నాయో వాటిని తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు, అదేవిధంగా మొదటి విడత ఎల్ 1 క్యాటగిరిలో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ళను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు ప్రారంభం గాని ఇల్లులు రెండో విడత ఇందిరమ్మ ఇల్లుల జాబితాలో చేర్చాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రవాణాతో కలిపి రు. 230 సిమెంట్ బస్తా ఉందని వాటితో లబ్ధిదారులకు వెలుసుబాటు కలుగుతుందని అధికారులు లబ్ధిదారులకు అందుబాటులో ఉండి సహకరించాలని సూచించారు. రాష్ట్రంలో జనగామ కలెక్టర్ రూపొందించిన యాప్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉందని వాటిని అన్ని జిల్లాల కలెక్టర్లు అమలు చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ-సర్వేలో లైసెన్స్డ్ సర్వేయర్లు తప్పనిసరిగా పాల్గొనాలని మంత్రి స్పష్టం చేశారు. రీ-సర్వే విధులకు హాజరుకాకుండా ప్రైవేట్ సర్వేలకు మాత్రమే పరిమితమయ్యే సర్వేయర్లకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.భూ సర్వే పనులకు అవసరమైన శిక్షణ పొందిన సిబ్బందిని తగిన సంఖ్యలో సిద్ధం చేయాలని, ప్రత్యామ్నాయ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కలెక్టర్లు, అదనపు కలెక్టర్లను ఆదేశించారు.సర్వే పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సర్వేను వేగవంతం చేయాలన్నారు. ధరణి స్థానంలో ప్రభుత్వం నూతన భూ భారతి వ్యవసాయ, రెవెన్యూ చట్టాలను తీసుకువచ్చి, అధికారాలను వికేంద్రీకరించి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్ స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించిందని మంత్రి తెలిపారు.ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా, పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. సాదా బైనామాలు తదితర సమస్యలను సమగ్రంగా పరిశీలించి, అర్హత ఉన్న ప్రతి రైతుకు చట్టబద్ధమైన హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దు వివాదాలను శాశ్వతంగా పరిష్కరించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా సమావేశమై, శాస్త్రీయ పద్ధతుల్లో భూముల కొలతలు చేపట్టి సరిహద్దులను నిర్ధారించాలని సూచించారు.గతంలో పోడు భూములకు పట్టాలు పొందిన రైతులు బోర్లు, విద్యుత్ కనెక్షన్లు తదితర సౌకర్యాలు పొందే సమయంలో ఎలాంటి ఇబ్బందులు, వేధింపులు ఎదుర్కోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు, ప్రజలకు చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తూ, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడం, పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం ప్రజా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.భూ సర్వే, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలులో అవినీతి, అక్రమాలు, నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, మాలోత్ రాందాస్ నాయక్, కోరం కనకయ్య,డాక్టర్ మట్టా రాగమయి,జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావ్,ఖమ్మం,భద్రాద్రి జిల్లా కలెక్టర్లు దివాకర్,అంకిత్, జిల్లా అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) వేణుగోపాల్, శ్రీనివాసరావు,స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ,విద్యా చందన, భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్, డీ.ఎఫ్.ఓ విక్రమ్ సింగ్,కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్,సర్వే, ఫారెస్ట్, ఇతర శాఖల అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కన్సల్టెన్సీ ఆఫీస్‌గా మారిన అశ్వరావుపేట ప్రభుత్వ దవాఖానా?

(మొదటి పేజీ తరువాయి...)

డబ్బులు ఎందుకు ఇవ్వాలి? ఎవరికి ఇవ్వాలి? ఏ సేవకు ఇవ్వాలి? అధికారిక రసీదు ఉందా? అంటూ ప్రజలు నిలదీస్తున్నారు.

**ప్రసవానికి కూడా వసూళ్లేనా?**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. వైద్యులు, సిబ్బంది, మందులు, ఇతర సదుపాయాల కోసం ప్రజాధనం వెచ్చిస్తోంది. అయితే అశ్వరావుపేట ప్రభుత్వ దవాఖానలో ప్రసవాల సమయంలో డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలు నిజమైతే, ఇది అత్యంత తీవ్రమైన అంశం.

**ఒక పేద కుటుంబం ప్రశ్నిస్తోంది—**

"బిడ్డను కనడానికి ప్రభుత్వ దవాఖానకు వచ్చాం... ఇక్కడ కూడా డబ్బులు ఇవ్వాల్సిందేనా?"

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

**వైద్యం చేయరు... ప్రశ్నిస్తే కేసులా?**

ప్రజలకు సరైన వైద్యం అందడం లేదని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కేసులు పెడతామంటూ బెదిరింపులు వస్తున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ సేవలపై ప్రశ్నించే హక్కు ప్రజలకు ఉంది. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు సరిగా అందుతున్నాయా లేదా అని ప్రశ్నించడం నేరమా?

"వైద్యం అడిగితే సమాధానం చెప్పాలి... ప్రశ్నించిన వారిపై కేసుల మాట ఎందుకు?" అంటూ స్థానికులు నిలదీస్తున్నారు.

ఆరోపణలు చేస్తున్న ప్రజలను బెదిరించడం కాకుండా, అసలు సమస్య ఏమిటి? వైద్య సేవల్లో లోపాలున్నాయా? సిబ్బంది కొరత ఉందా? వసూళ్ల ఆరోపణల్లో నిజమెంత? అనే అంశాలపై నిష్పక్షపాత విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

**డీసీహెచ్ఎస్‌కు ఖాళీ లేదట... మరి బాధ్యత ఎవరిది?**

ఆసుపత్రి పరిస్థితిపై ఫిర్యాదులు చేసినా, ఉన్నతాధికారులను ఆశ్రయించినా "ఖాళీ లేదు" అనే సమాధానం వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

ఖాళీ లేకపోతే ప్రజల సమస్యలు కూడా ఖాళీ అయిపోతాయా?

ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలు ఉంటే వాటిని పరిశీలించడానికి, బాధ్యులపై చర్యలు తీసుకోవడానికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రత్యామ్నాయ వ్యవస్థ లేదా?

ఒక అధికారి అందుబాటులో లేకపోతే జిల్లా యంత్రాంగం మొత్తం చేతులెత్తేయాలా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**కలెక్టర్ సార్... మీరైనా స్పందించండి!**

అశ్వరావుపేట ప్రభుత్వ దవాఖానపై వస్తున్న ఆరోపణలు సాధారణమైనవి కావు. ఇవి నేరుగా పేద ప్రజల ఆరోగ్యానికి, గర్భిణీలకు, నవజాత శిశువులకు సంబంధించిన అంశాలు.

అందుకే జిల్లా కలెక్టర్ స్వయంగా స్పందించి—

ప్రసవాల సమయంలో ఎలాంటి వసూళ్లు జరుగుతున్నాయో విచారణ చేయాలి

ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆకస్మిక తనిఖీ నిర్వహించాలి

రోగులు, వారి కుటుంబ సభ్యుల నుంచి నేరుగా వివరాలు సేకరించాలి

అక్రమ వసూళ్ల ఆరోపణల్లో నిజం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

వైద్య సేవల్లో సిబ్బంది కొరత ఉంటే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలి

ప్రశ్నించే ప్రజలనూ మరియు ప్రశ్నించే గొంతుకలను నొక్కేయాలని ప్రయత్నిస్తున్నారు ఈ ఆరోపణలపై కూడా విచారణ చేయాలి

అని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రజాజ్యోతి ప్రశ్నలు**

ప్రభుత్వ దవాఖానలో ప్రసవానికి డబ్బులు ఎందుకు?

డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణల్లో నిజమెంత?

వసూలు చేస్తే ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయి?

వైద్య సేవలపై ప్రశ్నిస్తే కేసుల మాట ఎందుకు?

ఫిర్యాదులు వచ్చినప్పుడు ఉన్నతాధికారుల స్పందన ఎందుకు లేదు?

"ఖాళీ లేదు" అనే సమాధానంతో ప్రజల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందా?

పేదల ప్రాణాలతో, గర్భిణీల అవసరాలతో ప్రయోగాలు చేయడం ఎంతవరకు సమంజసం?

**వైద్యం హక్కు... వసూళ్లు కాదు!**

ప్రభుత్వ ఆసుపత్రి గుమ్మం దాటేది ఎక్కువగా పేద, మధ్యతరగతి ప్రజలే. ప్రైవేట్ ఆసుపత్రుల ఖర్చులు భరించలేక ప్రభుత్వ వైద్యంపై నమ్మకంతో వచ్చే వారి వద్ద కూడా డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలు వస్తే అది అత్యంత ఆందోళనకర విషయం.

అశ్వరావుపేట ప్రభుత్వ దవాఖాన నిజంగా ప్రజలకు వైద్య సేవల కేంద్రంగా పనిచేస్తోందా? లేక ఆరోపణలు వస్తున్నట్లుగా కన్సల్టెన్సీ వ్యవస్థగా మారిపోయిందా?

ఈ ప్రశ్నలకు సమాధానం రావాలి.

కలెక్టర్ సార్... ఫిర్యాదులు వినిపిస్తున్నాయి... ప్రజలు ప్రశ్నిస్తున్నారు... ఇక మీరైనా స్పందించండి! అశ్వరావుపేట ప్రభుత్వ దవాఖానపై సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలు ప్రజలకు వెల్లడించి, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

— ప్రజల ప్రశ్నకు సమాధానం చెప్పేది ఎవరు?

— ప్రభుత్వ దవాఖానలో పేదలకు న్యాయం జరిగేది ఎప్పుడు?

# కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్న రెవిన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్ లోకేష్ కుమార్

- ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు
- ఐ డి ఓ సి కి చేరుకున్న వీరికి ఘనంగా స్వాగతం పలికిన
- జిల్లా కలెక్టర్ అంకిత్





**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 3, (ప్రజా జ్యోతి)** ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఉన్నతస్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్, రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శిగా డి.ఎస్. లోకేశ్ కుమార్ ,రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి (రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు) రాజీవ్ గాంధీ హనుమంతు భద్రాద్రి ఐడిఓసికి గురువారం చేరుకున్నారు. వీరిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఘనంగా స్వాగతించి పూల మొక్కను అందజేశారు, అనంతరం ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో జరుగుతున్న భూ – సర్వే,సాదా బైనమా, రెవిన్యూ సదస్సులు, తదితర అంశాలపై అధికారులతో ఐడిఓసి లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రివ్యూ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ రీ సర్వేను సకాలంలో పూర్తిచేయాలని అధికారులకు సలహాలు, సూచనలు అందించారు.ఈ సమావేశంలో ఖమ్మం కలెక్టర్ దివాకర్, భద్రాద్రి జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట్,కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ కుమార్,ఉమ్మడి జిల్లాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ శాఖలో ప్రక్షాళన

- ఖమ్మం,భద్రాద్రిలో కొత్త ఎస్హెచ్ఓల నియామకం
- మణుగూరు ఎస్హెచ్ఓగా కె. నాగేశ్వరరావు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. సెప్టెంబర్ 03,(ప్రజాజ్యోతి)** ఖమ్మం డివిజన్ పరిధిలో ఎక్సైజ్ పోలీసు అధికారులకు పోస్టింగులు కేటాయిస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా పలువురు అధికారులను ఆయా పోలీస్ స్టేషన్లు, విభాగాలకు బదిలీ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలో ఖమ్మం–1 ఎస్హెచ్ఓగా చిరంజీవి,ఖమ్మం–2 ఎస్హెచ్ఓగా కే.రాజు, సత్తుపల్లికి సంపత్ కృష్ణ,మధిరకు బాలకిషన్,వైరాకు నాగయ్య,సింగరేణికి లింగయ్య,నేలకొండపల్లికి రమ్యలను అధికారులు నియమించారు.అదే విధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం ఎస్హెచ్ఓగా రాజశేఖర్ రావు,భద్రాచలం ఎస్హెచ్ఓ గా బి.కిష్టయ్య, మణుగూరు ఎస్హెచ్ఓగా కె.నాగేశ్వరరావు,పాల్వంచ ఎస్హెచ్ఓ గా అశోక్ కుమార్, ఇల్లెందు ఎస్హెచ్ఓగా సిహెచ్ నాగేశ్వరరావులను నియమించారు. అంతేకాకుండా కొత్తగూడెం ఏఈఎస్ గా ఎన్.శ్రీనివాస్, ఎన్ ఫోర్స్ మెంట్ వింగ్ ఇన్స్పెక్టర్లుగా నరేందర్,శశికుమార్,ఖమ్మం డీటీఎఫ్ సీఐగా రంగస్వామిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.నియమితులైన అధికారులందరూ తక్షణమే తమ పోస్టుల్లో బాధ్యతలు స్వీకరించాలని స్పష్టంగా ఆదేశించారు.

## పెద్దమ్మ తల్లి అమ్మవారికి వైభవంగా సువర్ణ పుష్పార్చన



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 3,(ప్రజా జ్యోతి )** పాల్వంచ మండల పరిధి లోని కెపి జగన్నాధపురం గ్రామంలో కొలువుతీరిన పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి ప్రతి గురువారం మాదిరిగా 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా ఆలయ అర్చకులు సువర్ణ పుష్పార్చన పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, అనంతరం అమ్మవారికి నివేదన ,నీరాజన, మంత్రపుష్పం పూజలు చేశా రు ,ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

## "గుంతలు పూడ్చడం మరిచారు.. మట్టి కుప్పలు వదిలేశారు"

- మణుగూరులో మున్సిపల్ అధికారుల నిర్వాకం..!
- దుకాణాల ముందే మట్టి కుప్పలు..పట్టించుకునే నాథుడేడీ..?
- సురక్ష బస్టాండ్ వద్ద మట్టి కుప్పలతో నరకం చూస్తున్న ప్రజానీకం






**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. సెప్టెంబర్ 03,(ప్రజాజ్యోతి)** మణుగూరు మున్సిపాలిటీ పనితీరుకు మట్టి కుప్పలే నిదర్శనం.సురక్ష బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు సంబంధిత కాంట్రాక్టర్ పది రోజుల క్రితం యాష్ కంకరతో కూడిన మట్టిని తీసుకొచ్చి దుకాణాల ముందు కుప్పగా పోశారు. గుంతలు పూడ్చడం మరిచి అక్కడి నుండి జారుకున్నారు. దీంతో ఆ మట్టి కుప్ప వల్ల ప్రధాన రహదారి మొత్తం దుమ్ము ధూళితో నిండిపోయి వ్యాపారులు,వాహనదారులు,పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గుంతలను పూడ్చకపోగా కొత్తగా మట్టి కుప్పలను సృష్టించి ప్రజలకు నరకం చూపిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రోడ్డుపై వాహనాలు వెళ్తుంటే దుమ్ము లేచి దుకాణాల్లోని సరుకులపై పడుతోందని,ఊపిరాడక ఇబ్బంది పడుతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు వెంటనే స్పందించి ఆ మట్టి కుప్పను తొలగించి, ప్రధాన రహదారిపై గుంతలను పూడ్చి మరమ్మత్తులు చేపట్టాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## యంఆర్జి స్కూల్ లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



**ఇల్లందు, సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి)** శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని యంఆర్జి నారాయణ స్కూల్ లో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలో పాఠశాలకు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారుల ముద్దుముద్దు వేషధారణలు, కృష్ణుడి లీలలను ప్రతిబింబించేలా చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కృష్ణుడి లీలల ప్రదర్శన,శ్రీకృష్ణుడి బాల్య లీలలు, ఆయన జీవిత విశేషాలను తెలియజేస్తూ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పాటలు, నృత్యాలు, వేషధారణలతో చిన్నారులు తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఒంగూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. శ్రీకృష్ణుడి జీవితంలో ఉన్న ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను చిన్నారులు అలవర్చుకోవాలని సూచించారు. పండుగలను నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, అబ్దుల్లా, రుబీనా, రేష్మ, సౌందర్య, పద్మ, ఆయేషా, రహిమ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

**చర్ల, సెప్టెంబర్ 03:(ప్రజాజ్యోతి):** కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని చర్లలోని గురుదేవ్ విద్యాలయంలో గురువారం ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. చిన్నారులు ఉట్టి కొట్టి సందడి చేయడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా చిన్నారులకు పండుగ విశిష్టతను తెలియజేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, అకడమిక్ కోఆర్డినేటర్లు చిన్నారులను ఆశీర్వదించి, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రీ–ప్రైమరీ ఉపాధ్యాయులు రవళి, డి. ప్రవల్లిక, రేవతి రాణి, రత్నకుమారి, మాధురిలను అభినందించారు.



## చర్లలో కాంగ్రెస్ భారీ బైక్ ర్యాలీ



**చర్ల, సెప్టెంబర్ 03:(ప్రజాజ్యోతి):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా చర్ల మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరై కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు.టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళి ఆధ్వర్యంలో, చర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ నాయుడు, సీనియర్ నాయకులు లంక రాజు, బ్రహ్మానందరెడ్డి నేతృత్వంలో ర్యాలీ కొనసాగింది. భారీ సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సుపరిపాలన, ప్రజా సమస్యల పరిష్కారంపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ర్యాలీతో చర్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణుల్లో సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి నాయకులు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మల కృషితో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల ఆశల సాకారం

- పాండురంగాపురం-మల్కనగిరి రైల్వే లైన్ కు క్లియర్
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవతో మంత్రి తుమ్మల జరిపిన చర్చలు సఫలం



**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 3 ,(ప్రజా జ్యోతి)** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఎన్నో సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్న పాండు రంగాపురం మల్కనగిరి రైల్వే పనులకు త్వరలో శ్రీకారం చుట్టనున్నారు, పాండురంగాపురం నుంచి మధ్యలోని సాకేతపురి (సారపాక) వరకు సుమారు 16 కి.మీ. రైల్వే లైన్ పనులను ముందుగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను విన్నవించగా మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించి, ఈ మార్గంలో పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు, రైల్వే మంత్రితో జరిగిన చర్చలో పాండురంగాపురం–మల్కన్‌గిరి రైల్వే లైన్ ప్రస్తుత పరిస్థితిని మంత్రి తుమ్మల వివరించారు. గతంలో రైల్వే మంత్రులుగా పనిచేసిన లాలూ ప్రసాద్ యాదవ్, మమతా బెనర్జీ, సురేశ్ ప్రభు, పీయూష్‌గోయల్ హయాంలోనూ ఈ రైల్వే లైన్ ప్రతిపాదనకు అనుకూలత లభించినప్పటికీ.. వివిధ కారణాలతో పనులు పూర్తిస్థాయిలో ముందుకు సాగలేదని తెలిపారు.భూసేకరణ, అటవీ శాఖ అనుమతులు, గోదావరి వంతెనతో పాటు ఇతర రైల్వే వంతెనల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియలు పూర్తి ప్రాజెక్టుకు ప్రధాన అవరోధాలుగా ఉన్నాయని మంత్రి వివరించారు. ఈ అంశాలన్నింటినీ పరిష్కరించి పాండురంగాపురం–మల్కన్‌గిరి పూర్తి రైల్వే లైన్‌ను నిర్మించేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు.అయితే పాండురంగాపురం నుంచి సాకేతపురి (సారపాక) వరకు సుమారు 16 కి.మీ. మేర రైల్వే లైన్ నిర్మాణానికి పెద్దగా అవరోధాలు లేనందున.. ఈ దశలో ఆ పనులను ముందుగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి తుమ్మల కోరారు.పాండురంగాపురం–సాకేతపురి మధ్య రైల్వే లైన్‌కు అవసరమైన భూ సేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి, అవసరమైన భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి తెలిపారు, ఇందుకు స్పందించిన రైల్వే శాఖ మంత్రి పాండురంగాపురం–సాకేతపురి మార్గంలో పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులను ఆదేశించారు. దీంతో ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న భద్రాద్రి ప్రాంత రైల్వే కనెక్టివిటీకి తొలి అడుగు పడినట్లయింది. ఈ రైల్వే నిర్మాణంతో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఈ రైల్వే మార్గం ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. సాకేతపురి వరకు రైల్వే సౌకర్యం అందుబాటులోకి వస్తే భద్రాచలం ప్రాంతానికి రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.రైల్వే కనెక్టివిటీతో భద్రాచలంలో ఆధ్యాత్మిక పర్యాటకానికి కొత్త ఊపు వచ్చే అవకాశం ఉంది. భద్రాచలం, గోదావరి పరివాహక ప్రాంతాల్లో పర్యాటక కార్యకలాపాలు విస్తరించడంతో పాటు.. భక్తులు, పర్యాటకుల రాక పెరగడం ద్వారా స్థానికంగా ఉపాధి, వ్యాపార అవకాశాలు మెరుగుపడనున్నాయి.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పారిశ్రామిక రంగానికి కూడా రైల్వే కనెక్టివిటీ కీలకంగా మారనుంది. సింగరేణి, బీపీఎల్, వాటర్ ప్లాంట్లు, కేటీపీఎస్ తదితర పరిశ్రమలకు ముడిసరుకు, ఉత్పత్తుల రవాణా మరింత సులభతరం కానుంది. రైల్వే సౌకర్యం అందుబాటులోకి రావడంతో కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు ఆకర్షించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడనుంది, పాండురంగాపురం–మల్కన్‌గిరి రైల్వే లైన్ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు ఒక్కొక్కటిగా తొలగుతున్న క్రమంలో.. ఈ దశలో సాకేతపురి వరకు రైల్వే లైన్ అందుబాటులోకి రావడం భద్రాద్రి ప్రాంత అభివృద్ధికి కీలక మలుపుగా నిలవనుంది. ఆధ్యాత్మిక పర్యాటకం, పారిశ్రామిక ప్రగతి, స్థానిక ఉపాధి, వ్యాపార అవకాశాలకు ఈ రైల్వే కనెక్టివిటీ మరింత బలాన్నివ్వనుంది.



# సమతుల ఆహారం పోషకాహారం పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి

- నేత్ర దానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి
- డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారం రాథోడ్



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 3 , (ప్రజా జ్యోతి)**

పోషకాహార వారోత్సవం సందర్భంగా ప్రజల్లో సమతుల ఆహారం, పోషకాహారం ప్రాధాన్యతపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ పలువురు వైద్యులకు సూచించారు,పాల్వంచలోని డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఫార్మసీ అధికారులు, ఎంపీహెచ్ఏ (మేల్), మలేరియా నోడల్ అధికారులు తదితరులతో డీఎంహెచ్ఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ ఓ మాట్లాడుతూసమతుల ఆహారం – ఆరోగ్యానికి పునాది అన్నారు, ప్రస్తుతం నిర్వహిస్తున్న పోషకాహార వారోత్సవం (సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు) సందర్భంగా ప్రజలకు సమతుల ఆహారం ప్రాధాన్యతను వివరించాలని డీఎం హెచ్ ఓ సూచించారు. శరీరానికి అవసరమైన పిండి పదార్థాలు, ప్రోటీన్లు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు తగినంత నీరు సమతుల మోతాదులో తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.ముఖ్యంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు, కిశోర బాలికలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు.ఆహారంలో ఆకుకూరలు, తాజా కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పాలు మరియు పాల ఉత్పత్తులు, గుడ్లు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను చేర్చుకోవాలని సూచించారు. అధికంగా నూనె, ఉప్పు, చక్కెర కలిగిన ఆహార పదార్థాలు జంక్‌ఫుడ్‌ను తగ్గించాలని తెలిపారు.ప్రతి కుటుంబంలో “సమతుల ఆహారం – సంపూర్ణ ఆరోగ్యం” అనే సందేశాన్ని విస్తృతంగా తీసుకెళ్లాలని, ఆరోగ్య సిబ్బంది గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు.కంటి దానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు, అనంతరం నిర్వహిస్తున్న 41వ జాతీయ కంటి దాన పక్షోత్సవం (ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు) సందర్భంగా కంటి దానం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని డీఎంహెచ్ఓ తెలిపారు.కంటి దానం ద్వారా మరణించిన వ్యక్తి నుంచి సేకరించిన కార్నియాను అవసరమైన వారికి మార్పిడి చేసి, కార్నియా సంబంధిత అంధత్వంతో బాధపడుతున్న వారికి చూపును తిరిగి అందించే అవకాశం ఉంటుందని వివరించారు.కంటి దానం పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, శాస్త్రీయ అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ కంటి దానంపై అవగాహన పెంపొందించుకుని, తమ కుటుంబ సభ్యులు మరియు పరిచయస్తులకు కూడా ఈ విషయాన్ని తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎం హెచ్ఓ డాక్టర్ తుకారం రాథోడ్ సమతుల ఆహారం యొక్క ప్రాముఖ్యత, పోషకాహార లోపం వల్ల కలిగే సమస్యలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, విటమిన్లు మరియు ఖనిజ లవణాల అవసరాన్ని వివరించారు.అలాగే 41వ జాతీయ కంటి దాన పక్షోత్సవం సందర్భంగా ప్రతి ఉద్యోగి తన పరిధిలో కంటి దానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, కంటి దానం పట్ల ప్రజల్లో సానుకూల దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని డీఎం హెచ్ఓ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు వైద్యులు, ఐడిఎస్పి సిబ్బంది పాల్గొన్నారు.

## కృష్ణుడి బోధనలు విద్యార్థులకు ఆదర్శం

- బ్రిలియంట్ విద్యాసంస్థల్లో ఘనంగా జన్మాష్టమి వేడుకలు

**సారపాక, సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాకలో గల బ్రిలియంట్ విద్యాసంస్థల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ముందస్తుగా గురువారం అత్యంత ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు, శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో సందడి చేయడంతో విద్యాసంస్థల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ సందర్భంగా డా. బి.ఎన్.ఆర్. మాట్లాడుతూ శ్రీకృష్ణుడు కేవలం దేవుడు మాత్రమే కాదని, గొప్ప గురువుగా, నాయకుడిగా, మార్గదర్శిగా నిలిచారని అన్నారు. భగవద్గీత ద్వారా మానవాళికి కర్తవ్యబోధను అందించారని పేర్కొన్నారు. “నీ కర్తవ్యాన్ని నీవు నిర్వర్తించు.. ఫలితాన్ని ఆశించకు” అనే శ్రీకృష్ణుడి బోధన ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు.నేటి విద్యార్థులు శ్రీకృష్ణుడి జీవితాన్ని, బోధనలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.విద్యార్థి దశలో అల్లరితో పాటు ఆలోచనా విధానం, క్రమశిక్షణ,పట్టుదల, లక్ష్యసాధనపై దృష్టిసారించాలని అన్నారు. జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే దిశగా కష్టపడి ముందుకు సాగితే విజయాన్ని అందుకోవచ్చని విద్యార్థులకు సూచించారు.జన్మాష్టమి వేడుకల్లో భాగంగా చిన్నారి విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ,గోపికల వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.రంగురంగుల దుస్తుల్లో ముస్తాబైన చిన్నారులు శ్రీకృష్ణుడి బాల్య ఘట్టాలను ప్రతిబింబించేలా ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థులు ఆలపించిన భక్తిగీతాలు, ఆటపాటలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. చిన్నారుల కృష్ణవేషాలు, నృత్యాలు, ఆటపాటలతో విద్యాసంస్థల ప్రాంగణంలో పండుగ సందడి నెలకొంది. తల్లిదండ్రులు సైతం కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకిస్తూ చిన్నారులను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ డా. బి.ఎన్.ఆర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## గ్రామీణ గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

- విపంచి ఫౌండేషన్ కు సర్పంచ్,ఉప సర్పంచ్ అభినందనలు



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి):** గ్రామీణ ప్రాంతాల్లో పుస్తక పఠనాన్ని ప్రోత్సహించి, యువతలో విజ్ఞానాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో విపంచి ఫౌండేషన్ చేపడుతున్న గ్రామీణ గ్రంథాలయాల ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా బూర్గంపహాడ్ మండలం ఇరవెండి గ్రామపంచాయతీకి పుస్తకాలను అందజేశారు. హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో నిర్వహించిన గ్రామీణ గ్రంథాలయాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఇరవెండి గ్రామపంచాయతీకి ఈ పుస్తకాలను అందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా. మహ్మద్ రియాజ్, ఐఏఎస్ అధికారి డా. ఏనుగు నరసింహారెడ్డి, విపంచి ఫౌండేషన్ చైర్మన్ ఏనుముల శ్రీనివాస్ పాల్గొన్నారు. వారి చేతుల మీదుగా ఇరవెండి గ్రామ సర్పంచ్ గుండి బాబురావు, ఉప సర్పంచ్ మహంకాళి రామారావుకు పుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ గ్రామాల్లో గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు చదివే ప్రదేశాలుగా కాకుండా విజ్ఞాన కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని, పుస్తకాల ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు విపంచి ఫౌండేషన్ చేస్తున్న కృషిని వారు అభినందించారు.ఇరవెండి గ్రామపంచాయతీకి పుస్తకాలను అందించిన విపంచి ఫౌండేషన్ చైర్మన్ ఏనుముల శ్రీనివాస్‌తో పాటు కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులకు గ్రామ ప్రజల తరపున సర్పంచ్ గుండి బాబురావు, ఉప సర్పంచ్ మహంకాళి రామారావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భూక్యా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోలే!

- తన సొంతగా కిలోమీటర్ మేర కాలువలను శుభ్రం చేయించిన కౌన్సిలర్ దండు సారయ్య
- అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రజల ఆగ్రహం
- పన్నులు వసూలు చేయడం లేదా అనే ప్రశ్నలు
- కౌన్సిలర్ సొంత డబ్బులతో కాలువలను శుభ్రం చేయడం పట్ల ప్రజల హర్షం
- ప్రజా సేవ చేయడం, వారి సమస్యల పరిష్కారమే తన కర్తవ్యమని స్పష్టం చేసిన దండు సారయ్య
- తప్పనిసరిగా కాలువలు శుభ్రం చేయాలని అధికారులను కోరిన 13వ వార్డు కౌన్సిలర్





ఇల్లందు, సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి) పట్టణంలోని 13వ వార్డులో కాలువల సమస్యపై మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో వార్డు కౌన్సిలర్ దండు సారయ్య స్వయంగా రంగంలోకి దిగారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తన సొంత ఖర్చులతో గురువారం సుమారు కిలోమీటర్ మేర కాలువలను శుభ్రం చేయించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. దీంతో కౌన్సిలర్ చొరవపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులకు పలుమార్లు విన్నపం**

13వ వార్డులో పలు ప్రాంతాల్లో కాలువలు మురుగుతో నిండిపోవడంతో మురుగునీరు సక్రమంగా ప్రవహించక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ దండు సారయ్య తెలిపారు. ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా సకాలంలో స్పందన లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా తన సొంత ఖర్చులతో కాలువల శుభ్రత పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

**కిలోమీటర్ మేర కాలువల శుభ్రత**

వార్డులోని ప్రధాన కాలువలు, చిన్న డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త, మురుగు, వ్యర్థాలను తొలగించేలా సిబ్బందితో శుభ్రత పనులు చేపట్టారు. సుమారు కిలోమీటర్ మేర కాలువలను శుభ్రం చేయించడంతో మురుగు నీటి ప్రవాహానికి ఇబ్బందులు తొలగినట్లు స్థానికులు చెబుతున్నారు.



**అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం**

ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్న అధికారులు వారి ప్రాథమిక సమస్యల పరిష్కారంపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాలువల శుభ్రత వంటి కనీస పారిశుధ్య పనులకు కూడా ప్రజాప్రతినిధులు సొంతంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి రావడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పన్నులు వసూలు చేయడం లేదా?**

పట్టణ ప్రజల నుంచి వివిధ రకాల పన్నులు, రుసుములు వసూలు చేస్తున్నప్పటికీ పారిశుధ్య నిర్వహణపై నిరంతర చర్యలు ఎందుకు ఉండటం లేదని ప్రజలు నిలదీస్తున్నారు. వర్షాకాలంలో కాలువలు మురుగుతో నిండిపోతే దోమలు, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కౌన్సిలర్ చొరవపై హర్షం**

అధికారుల కోసం ఎదురుచూడకుండా ప్రజల సమస్యను తన సమస్యగా భావించి సొంత డబ్బులతో కాలువలను శుభ్రం చేయించిన కౌన్సిలర్ దండు సారయ్యను స్థానికులు అభినందిస్తున్నారు. ప్రజల ఇబ్బందులను వెంటనే పరిష్కరించేందుకు ముందుకు రావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

**ప్రజా సేవే నా కర్తవ్యం: కౌన్సిలర్ దండు సారయ్య**

ప్రజలకు సేవ చేయడం, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడమే తన ప్రధాన కర్తవ్యమని కౌన్సిలర్ దండు సారయ్య స్పష్టం చేశారు. వార్డులో ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. 13వ వార్డులోని అన్ని కాలువలను క్రమం తప్పకుండా శుభ్రం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక్కసారి శుభ్రం చేయడం ద్వారా సమస్య శాశ్వతంగా పరిష్కారం కాదని, నిరంతర పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక అవసరమని సూచించారు.

**ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలి**

కాలువల్లో చెత్త పేరుకుపోవడం, మురుగునీరు నిలిచిపోవడం వల్ల దోమల బెడద పెరిగే అవకాశం ఉందని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కౌన్సిలర్ కోరారు. వార్డులోని అన్ని కాలువలను పరిశీలించి అవసరమైన చోట తక్షణమే శుభ్రం చేయాలని విజ్ఞప్తి చేశారు. తన వార్డులో నాకున్న ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తానని మున్సిపల్ ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఆ హామీ మేరకే మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో తానే సొంత డబ్బులతో కాలువలను శుభ్రం చేయించడం జరిగిందని తెలిపారు. కౌన్సిలర్ సొంత ఖర్చులతో కాలువలను శుభ్రం చేయించిన పరిస్థితి పునరావృతం కాకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా కాలువల శుభ్రతకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## మార్గదర్శినిలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



ఇల్లందు, సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి) శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని మార్గదర్శిని స్కూల్ లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణతో పాఠశాల ప్రాంగణమంతా సందడి నెలకొంది. తమ పాఠశాలలో ప్రతి పండుగను ఉత్సాహంతో విద్యార్థులతో కలిసి జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని పాఠశాల డైరెక్టర్లు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యాదగిరి రాంబాబు, అర్వపల్లి రాధాకృష్ణలు పేర్కొన్నారు. ప్రజలందరికీ శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

## రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- బిఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు



చర్ల, సెప్టెంబర్ 03: (ప్రజా జ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్యాయం చేసిందని బీఆర్ఎస్ చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు గురువారం కొత్తపల్లి గ్రామంలో రైతు సమస్యలపై రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ రైతు రాజ్యం వస్తుందని ఆశిస్తే రావణ రాజ్యం వచ్చిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతు బీమా పథకంపై నిర్లక్ష్యం వహించడంతో పాటు రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతు భరోసా కింద ఏటా రూ.15 వేలు, సన్న వడ్లకు రూ.500 బోనస్, కౌలు రైతులకు రైతు భరోసా, రైతు కూలీలకు రూ.12 వేల ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి హామీలు ఇచ్చారని, వాటి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పంటల సాగు కీలక దశలో సకాలంలో ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. షాపుల్లో యూరియా అందుబాటులో లేకుండా యాప్ ల ద్వారా సరఫరా చేస్తామనడం వల్ల రైతుల సమస్యలు మరింత పెరుగుతున్నాయని విమర్శించారు. రైతులకు అవసరమైన యూరియాను సరిపడా, సకాలంలో అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కో-కన్వీనర్ అయినపోలు పవన్‌కుమార్, కొత్తపల్లి సర్పంచ్ ఉప్పల నాగలక్ష్మి , మొగళ్లపల్లి ఉపసర్పంచ్ ఎడ్ల రామదాసు, యువజన నాయకులు కాకి అనిల్, పంజా రాజు తదితర నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ ప్రాముఖ్యత తప్పనిసరి



ఇల్లందు, సెప్టెంబర్ 3 (ప్రజా జ్యోతి) జాతీయ లోక్ అదాలత్ ప్రాముఖ్యత తప్పనిసరిగా కలిగి ఉంటూ, కొందరికి అవగాహన కల్పించాలని ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి స్వరూప కటం అన్నారు. గురువారం స్థానిక ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇల్లందు కోర్టు పరిధిలో గల పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ, ఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఈనెల 12న జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా అందరూ ఎస్హెచ్ఓ లు బాధ్యతగా సహకరించి రాజీ పడదగిన కేసులను ఇరువర్గాల సమన్వయ పరిచి, లోక్ అదాలత్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఆయా స్టేషన్ లలో కౌన్సిలింగ్ నిర్వహించి, పెద్ద మొత్తంలో కేసులు రాజీ పడే విధంగా కృషి చేసి లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోర్టు సూపరిండెంట్ రామకృష్ణ, ఎస్హెచ్ఓలు, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఊకె శిరీష కుటుంబానికి న్యాయం చేయాలి

- మహిళల రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి
- నిందితులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలి
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ సత్య డిమాండ్

పాల్వంచ, సెప్టెంబర్ 3, ప్రజాజ్యోతి: హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలానికి చెందిన ఊకె శిరీషను అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనపై సీఐటీయూ శ్రామిక మహిళా కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శిరీష కుటుంబానికి ప్రభుత్వం, ఆసుపత్రి యాజమాన్యం తగిన న్యాయం చేయాలని, ఘటనకు కారణమైన నిందితులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. గురువారం సీఐటీయూ పాల్వంచ శ్రామిక మహిళా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఊకె శిరీష చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ సత్య మాట్లాడుతూ మహిళలకు రక్షణ లేకుండా పోతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. పని ప్రాంతాల్లో మహిళల భద్రత కోసం ఉన్న చట్టాలను పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలపై హింసకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఊకె శిరీష హత్య కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొంటున్న సనముల్లా ఖాన్‌తో పాటు, ఘటనకు సహకరించిన వారందరినీ చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని సత్య డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి తగిన న్యాయం చేయాలని కోరారు. పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించే విషయంలో ప్రభుత్వం, సంబంధిత సంస్థల యాజమాన్యాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలపై అశ్లీలత, హింసను ప్రోత్సహించే కంటెంట్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని, మహిళల గౌరవం, భద్రతకు భంగం కలిగించే అంశాలపై చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా నాయకురాలు రమాదేవి, పద్మ, రుహినా, బేగం, నిర్మల, ఫాతిమున్, కృష్ణవేణి, విక్టోరియా, రహిమున్నిషాబేగం, రాణి తదితరులు పాల్గొన్నారు.



## శరవేగంగా విద్యుత్ సమస్యల పరిష్కారం

- ఎస్ఈ మహేందర్ ప్రత్యేక చొరవతో నూతన విద్యుత్ కనెక్షన్లు
- విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామ ప్రజలు



**పాల్వంచ, సెప్టెంబర్ 3, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల రూరల్ పరిధిలోని రంగాపురం గ్రామపంచాయతీ 6వ వార్డులో విద్యుత్ సమస్యకు సత్వర పరిష్కారం లభించింది. జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) మహేందర్ ప్రత్యేక చొరవతో విద్యుత్ కనెక్షన్లు లేని ఇళ్లకు నూతన విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.రంగాపురం గ్రామపంచాయతీ పరిధిలోని 6వ వార్డులో పలువురు ప్రజలు ఇళ్లు నిర్మించుకొని ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ కనెక్షన్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ఎస్ఈ మహేందర్ దృష్టికి వచ్చింది. దీంతో సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత విద్యుత్ శా ఖ అధికారులను ఆదేశించారు.ఎస్ఈ ఆదేశాల మేరకు స్థానిక విద్యుత్ శా ఖ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి విద్యుత్ కనెక్షన్లు లేని ఇళ్లకు నూ త న కనెక్షన్లు అందించే చర్యలు చేపట్టారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తు న్న విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది.విద్యుత్ సమస్యను సత్వరమే ప రిష్కరించి నూతన కనెక్షన్లు అందించిన జిల్లా ఎస్ఈ మహేందర్‌కు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి రంగాపురం గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపా రు. 6వ వార్డుకు చెందిన నూనవత్ విజయ ప్రత్యేకంగా ఎస్ఈ మహేందర్ కు, విద్యుత్ శాఖ అధికారులకు మరియు కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు.

## వర్తక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా గణపతి నవరాత్రి మహోత్సవాలు

- పాల్వంచ వర్తక సంఘం ఆధ్వర్యంలో ధ్వజ పూజ, భూమి పూజ.
- సెప్టెంబర్ 14న వినాయక చవితి సందర్భంగా మహోత్సవాలకు శ్రీకారం.



**పాల్వంచ, సెప్టెంబర్ 3, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణ వర్తక సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితిని పురస్కరించుకుని నిర్వహించనున్న గణపతి నవరాత్రి మహోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. మహోత్సవాల ప్రారంభోత్సవంలో భాగంగా వేద పండితులు నాని శర్మ ఆధ్వర్యంలో ధ్వజ పూజ, భూమి పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ధ్వజస్తంభాన్ని వంకదార ఇందిరా, కోలాటం శ్రీలక్ష్మి అలంకరించారు.గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఉత్సవ పందిరి వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు, అష్టోత్తర పూజలు, హోమాలు తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి వారికి బహుమతులు, అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షులు చలవాది ప్రకాష్ మాట్లాడుతూ పాల్వంచ పట్టణంలో గత 50 సంవత్సరాలుగా తొలిసారిగా వర్తక సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి మహోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు పెండ్యాల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి గూడెపు శ్రీనివాస్, కోశాధికారి బచ్చు శ్రీనివాస్, ఉప్పల వెంకటేశ్వర్లు, తాటికొండ సురేష్, పీపుల్స్ ఫుట్‌వేర్ వెంకటేశ్వర్లు, పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ కుమార్, ధారా నరసింహారావు, గర్రె శివ, సంపత్ కుమార్, మంత్రి, నెమలిపురి ఉపేందర్, బచ్చు వంశీ, పెండ్యాల రాము, కంటాల వెంకన్న, టి. శ్రీనివాస్, పూనం, పండు, యూసుఫ్, మార్వాడి సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డు అదుపులేని ఎర్రమట్టి దందా!

- పర్మిషన్ లేని నర్సరీలకు యథేచ్ఛగా అమ్మకాలు?
- ట్రిప్పు రూ.1,400 నుంచి రూ.1,800 వరకు వసూళ్లు!
- 10 నుంచి 15 అడుగుల లోతు తవ్వకాలు... అధికారులెక్కడ?





**అశ్వరావుపేట సెప్టెంబర్ 3 ప్రజా జ్యోతి :**
ఎర్రమట్టి అక్రమ రవాణా అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతోందనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీశాయి. మైనింగ్ నిబంధనలు, అనుమతులు, తవ్వకాల పరిమితులు అన్నీ పక్కనపెట్టి ఎర్రమట్టిని యథేచ్ఛగా తవ్వి, పర్మిషన్ లేని నర్సరీలకు సైతం తరలిస్తూ భారీగా వ్యాపారం సాగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఒక్కో ఎర్రమట్టి ట్రిప్పును రూ.1,400 నుంచి రూ.1,800 వరకు విక్రయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎర్రమట్టి రవాణా జరుగుతోందని, అయినప్పటికీ సంబంధిత శాఖల అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

### నిబంధనలు పక్కన... లోతుకు కొలతే లేదా?

మైనింగ్ శాఖ అనుమతుల ప్రకారం ఎక్కడ ఎంత మేరకు తవ్వాలి? ఎంత లోతు వరకు తీయాలి? ఎంత విస్తీర్ణంలో తవ్వకాలు జరపాలి? వంటి అంశాలకు నిబంధనలు, పరిమితులు ఉంటాయి.అయితే అవేమీ పట్టించుకోకుండా కొన్నిప్రాంతాల్లో సుమారు 10 నుంచి 15 అడుగుల వరకు లోతుగా ఎర్రమట్టి తవ్వుతున్నారనే ఆరోపణలు స్థానిక ప్రజల నుంచి వస్తున్నాయి.
ఈ ఆరోపణలు నిజమైతే భూమి స్వరూపం మారిపోవడమే కాకుండా, భారీ గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కూడా దారితీసే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అనుమతి ఎంతకు ఉంది? తవ్వింది ఎంత?

లోతు ఎంత వరకు అనుమతించారు? వాస్తవంగా ఎంత లోతు తవ్వారు?అనే అంశాలపై అధికారులే స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

### పర్మిషన్ లేని నర్సరీలకు మట్టి ఎలా?

ఎర్రమట్టిని కొనుగోలు చేస్తున్న నర్సరీలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? లేకపోతే మట్టి ఎక్కడి నుంచి వస్తోంది? దానికి రవాణా పత్రాలు ఉన్నాయా? రాయల్టీ చెల్లింపులు జరిగాయా?ఇలాంటి ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మైనింగ్, రెవెన్యూ, రవాణా మరియు సంబంధిత శాఖల అధికారులపై ఉందని ప్రజలు అంటున్నారు.పర్మిషన్ లేని నర్సరీలకు సైతం ఎర్రమట్టి అమ్మకాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, కొనుగోలు–అమ్మకాల వివరాలను బయట పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

### రెవెన్యూ అధికారులు ఎందుకు మౌనం?

భారీ యంత్రాలతో తవ్వకాలు జరుగుతున్నా, ట్రాక్టర్లు మరియు ఇతర వాహనాలతో మట్టి తరలిస్తున్నా సంబంధిత శాఖలకు కనిపించడం లేదా? లేక చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారా? అంటూ ప్రజలు నిలదీస్తున్నారు. “ఇంత భారీ స్థాయిలో తవ్వకాలు జరుగుతున్నప్పుడు అధికారులు ఎక్కడున్నారు?” అనే ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తోంది.మైనింగ్ శాఖ తనిఖీలు నిర్వహించిందా? రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారా? తవ్వకాల లోతును కొలిచారా? రవాణా చేస్తున్న వాహనాల వద్ద అనుమతి పత్రాలు ఉన్నాయా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

### అక్రమార్కులకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారా?

ఎర్రమట్టి అక్రమ రవాణాపై పదేపదే ఆరోపణలు వస్తున్నప్పటికీ చర్యలు లేకపోవడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. “నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారికి అధికారులు ఎందుకు అడ్డుకట్ట వేయడం లేదు? అక్రమార్కులకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారా?” అంటూ ప్రజలు తీవ్రస్థాయిలో ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరుగుతుందనే ఆరోపణలు ఒకవైపు, పర్యావరణం మరియు భూస్వరూపానికి నష్టం జరుగుతోందనే ఆందోళనలు మరోవైపు వ్యక్తమవుతున్నాయి.

### ప్రజాజ్యోతి ప్రశ్నలు

□ **ఎర్రమట్టి తవ్వకాలకు అసలు అనుమతి ఉందా?**
□ **అనుమతి ఉంటే ఎంత లోతు వరకు తవ్వేందుకు అనుమతించారు?**
□ **10 నుంచి 15 అడుగుల వరకు తవ్వారనే ఆరోపణల్లో నిజమెంత?**
□ **తవ్వకాల ప్రాంతాలను మైనింగ్ శాఖ అధికారులు పరిశీలించారా?**
□ **ఎర్రమట్టి రవాణాకు సరైన పత్రాలు ఉన్నాయా?**
□ **పర్మిషన్ లేని నర్సరీలకు మట్టి ఎలా చేరుతోంది?**
□ **ఒక్కో ట్రిప్పు రూ. 1,400 నుంచి రూ. 1,800 వరకు అమ్ముతున్నారనే ఆరోపణల్లో నిజమెంత?**
□ **ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ మొత్తం చేరుతోందా?**
□ **భారీ గుంతలు తవ్వి ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై చర్యలు ఎప్పుడు?**
□ **అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేది ఎవరు?**

### కలెక్టర్ సార్... విచారణకు ఆదేశించండి!

ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు, రవాణా, అనుమతులేని నర్సరీలకు విక్రయాలు, నిబంధనలకు విరుద్ధంగా లోతైన తవ్వకాలపై వస్తున్న ఆరోపణలను జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.తవ్వకాల ప్రాంతాలను అధికారులు స్వయంగా పరిశీలించి, అనుమతుల్లో పేర్కొన్న పరిమితులు మరియు వాస్తవ పరిస్థితులను సరిపోల్చాలి. అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ ఆదాయానికి జరిగిన నష్టాన్ని కూడా లెక్కించాలనే డిమాండ్ వినిపిస్తోంది.
అడ్డు అదుపు లేని ఎర్రమట్టి దందాకు ముగింపు ఎప్పుడు?
నిబంధనలు సామాన్యులకేనా... అక్రమార్కులకు వర్తించవా?
ప్రజల ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పే రోజు ఎప్పుడు?
ఎర్రమట్టి తవ్వకాలపై క్షేత్రస్థాయి తనిఖీ జరిపి, అనుమతులు–లోతు–రవాణా–విక్రయాలపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది. లేకపోతే “అధికారుల మౌనం వెనుక అసలు కారణం ఏమిటి?” అనే ప్రశ్న మరింత బలపడుతుందని స్థానికులు అంటున్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులుగా

- రాహుల్ విజ్ఞాన్ లో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం





**చర్ల, సెప్టెంబర్ 03(ప్రజా జ్యోతి ):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని చర్ల మండల కేంద్రంలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో గురువారం ముందస్తుగా సెల్ఫ్ టీచింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవానికి ముం దు రోజు సెలవు దినం కావడంతో ఈ కార్యక్రమాన్ని ముందుగానే నిర్వహించినట్లు పాఠశాల యాజమా న్యం తెలిపింది.ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మా రడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాఠశాల ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విభాగాధిపతులు, పీఈటీ లు , అటెండర్లు తో పాటు మండల విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి వంటి వివిధ బాధ్యతలను చేపట్టారు.విద్యార్థి–ఉపాధ్యాయులు క్రమశిక్షణతో తరగతులను నిర్వహిస్తూ తోటి విద్యార్థులకు వివిధ అంశాల్లో పాఠాలు బోధించారు. చక్కటి ప్రణాళికతో బోధన అందిస్తూ తమ బోధనా నైపుణ్యాలను ప్రదర్శించారు. ఉత్తమంగా పాఠాలు బోధించిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించింది.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలకు అనుగుణంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ఉపాధ్యాయ వృత్తిపై గౌరవాన్ని పెంచుతుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.





# కాంగ్రెస్ వైఫల్యాలపై ధ్వజమెత్తిన బీఆర్ఎస్

- రైతును నట్టేట ముంచిన కాంగ్రెస్
- మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు
- గ్యారెంటీ కార్డులు ఎక్కడ దాచుకోవాలి...?
- ఉప్పల వెంటారమణ





**ములకలపల్లి సెప్టెంబర్ 03, (ప్రజా జ్యోతి):** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టిన 'కాంగ్రెస్ 420 మోసాలపై పోరుబాట'లో భాగంగా ములకలపల్లి మండలంలో రైతు సదస్సు నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి ఉప్పల వెంకటరమణతో కలిసి మెచ్చా నాగేశ్వరరావు సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను విస్మరించిందని మెచ్చా నాగేశ్వరరావు ఆరోపించారు. రైతుబంధు నిధులు సక్రమంగా అందకపోవడంతో పాటు రుణమాఫీ విషయంలోనూ రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పంటలకు అవసరమైన యూరియా సకాలంలో అందక రైతులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇంటింటికీ పంచిన గ్యారెంటీ కార్డులను ఇప్పుడు రైతులు ఎక్కడ దాచుకోవాలని ఉప్పల వెంకటరమణ ప్రశ్నించారు. ఎరువుల దుకాణాల్లో యూరియా అందుబాటులో లేకపోయినా యాప్‌లలో స్టాక్ ఉన్నట్లు ఎలా చూపిస్తోందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు. ఈ సదస్సులో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు మోరంపూడి అప్పారావు, మాజీ ఎంపిపిలు మట్ల నాగమణి, జల్లిపల్లి శ్రీరాంమూర్తి, బోయినపల్లి సుధాకర్, నల్లమోతు వెంకటరమణ, దొడ్డ రమేష్, రావు జోగేశ్వరరావు, సర్పంచులు తుర్రం శ్రీనివాస్, తానం పద్మ, రసపుత్ర తిరుపతమ్మ భూక్య ధర్మ ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, రైతులు, యువకులు పాల్గొన్నారు.

## సంబురాలు కాదు రోడ్లు బాగు చేయండి

- ఇరప. రాజు దొర



**చర్ల, సెప్టెంబర్ 03:(ప్రజాజ్యోతి):** భద్రాచలం నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకుండా సంబురాలు, ఆర్భాట కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప. రాజు దొర అన్నారు. ముందుగా రహదారులను బాగు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.వాజేడు నుంచి భద్రాచలం వరకు ఉన్న ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనికి తోడు భారీ ఇసుక లారీల నిరంతర రాకపోకలతో రహదారి మరింత దెబ్బతింటోందన్నారు. ఈ మార్గంపై ఆధారపడే వందలాది గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లే రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.గుంతల కారణంగా ప్రమాదాల ముప్పు పెరుగుతోందని, అంబులెన్సులు సైతం సకాలంలో ప్రయాణించలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇసుక రవాణా ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నప్పటికీ, లారీల రాకపోకలతో దెబ్బతింటున్న రహదారుల మరమ్మతులపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు.వాజేడు–భద్రాచలం రహదారిని తక్షణమే మరమ్మతులు చేసి, అవసరమైన చోట పూర్తిస్థాయిలో పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. గుంతలను వెంటనే పూడ్చడంతో పాటు ఓవర్‌లోడింగ్, అధిక వేగంతో వెళ్లే ఇసుక లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రహదారి భద్రత కోసం హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజల ప్రాణాల కంటే సంబురాలు ముఖ్యం కాదు ముందుగా రోడ్లు బాగు చేయాలి ప్రజల ప్రాణాలను కాపాడాలి అని ఇరప. రాజు దొర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించకపోతే ప్రజలతో కలిసి రహదారి సమస్యపై పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం: కోరం కనకయ్య





**ములకలపల్లి సెప్టెంబర్03, (ప్రజాజ్యోతి):** చౌటిగూడెం గ్రామానికి చెందిన ఊకె శిరీష అనుమానాస్పద మృతి ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. శిరీష కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తో కలిసి గురువారం శిరీష కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా శిరీష కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తరపున కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం, ఒకరికి ఔట్‌సోర్సింగ ఉద్యోగం, వ్యవసాయ భూమి కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఊకంటి గోపాలరావు, బత్తుల అంజి, ఎండీ జహీరుద్దీన్, తాండ్ర ప్రభాకర్, పాలకుర్తి సుమిత్, కుంజా వినోద్, కారం సుధీర్, గాడి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొగళ్లపల్లిలో గ్రామసభ



**చర్ల, సెప్టెంబర్ 03:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని మొగళ్లపల్లి గ్రామపంచాయతీలో వీబీజీఆర్ఏఎంజీ పథకంలో భాగంగా వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికపై గురువారం మొదటి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమం గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు.అలాగే గ్రామ అభివృద్ధి కోసం పథకం కింద అనుమతించబడిన వివిధ అభివృద్ధి పనుల వివరాలను గ్రామసభలో ప్రజలకు వివరించారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు, పనుల అమలుపై ప్రజల సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు.ఈ గ్రామసభకు గ్రామ సర్పంచ్ కుప్పా సత్యవతి, ఉప సర్పంచ్ ఎడ్ల రామదాసు, సహాయ ప్రణాళిక అధికారి సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, సాంకేతిక సహాయకుడు బాలరాజుతో పాటు మొగళ్లపల్లి గ్రామ ప్రజలు హాజరయ్యారు.

## శ్రీ రామచంద్ర పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు



**చర్ల , సెప్టెంబర్ 03:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని ఆర్.కొత్తగూడెం గ్రామంలోని శ్రీ రామచంద్ర పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి ముందస్తు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. నర్సరీ నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.కృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబైన చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కృష్ణ భక్తి గీతాలకు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు చూపరులను అలరించాయి. అనంతరం పాఠశాల ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమం కోలాహలంగా సాగింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టి సంబరాలు చేసుకున్నారు.ఈ వేడుకలకు గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారుల ప్రదర్శనలను తిలకించి అభినందించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

## జీఎస్ శాంతినికేతన్ లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

**చర్ల, సెప్టెంబర్ 03:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని జీఎస్ శాంతినికేతన్ పాఠశాలలో విద్యార్థులు ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో పాఠశాలకు విచ్చేసి ఆటపాటలతో అలరించారు.కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు చేసిన సందడి పాఠశాలలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.ఈ వేడుకల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. పండుగల విశిష్టతను, భారతీయ సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది.

